సమావేశంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి చర్యలు

◆తగిన నివేదికను సిద్ధం చేయండి

◆దిశ పర్యవేక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ గోరంట్ల మాధవ్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలను అభివద్ధి చేయడానికి అవసరం అయ్యే కార్యాచరణ పనులకు నివేదికలు సిద్ధం చేయాలని హిందూపురం పార్లమెంట్ సభ్యుడు, దిశా ఛైర్మన్ గోరంట్ల మాధవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో సత్యసాయి జిల్లా అభివద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీ అధ్యక్షత జరిగిన సమావేశంలో దిశా కమిటీ కార్యదర్శి కలెక్టర్ అరుణ్ బాబు, సభ్యులు పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్, జెడ్పీ సీఈవో కేతన్ గార్గ్, సచివాలయాలను నోడల్ అధికారి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివద్ధి సంక్షేమ పథకాల ఫలాలను ప్రజలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కషి చేయాలన్నారు. జలజీవన్ మిషన్, తాగునీరు, వైద్య ఆరోగ్య సేవలు, ప్రభుత్వ పథకాలకు బ్యాంకు లింకేజీ, పంచాయతీ రోడ్లుభవనాలు, జాతీయ రహదారులు, రోడ్డు పనుల పురోగతి, వైకెపి, మెప్మా పనితీరు, ఎంపీ లార్డ్స్, వ్యవసాయం, ఉద్యానవన, మైనర్ ఇరిగేషన్, స్త్రీ శిశు సంక్షేమ, విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల పనితీరుపై సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల లక్ష్యాలను పూర్తిస్థాయిలో చేరుకునేందుకు ఆసుపత్రుల్లో తగిన అభివద్ధి చేయాలన్నారు. డిఆర్డిఎ, మెప్మా అర్హత కలిగిన వారికి బ్యాంకు రుణాలు ఇచ్చేలా చూడాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించి కేటాయించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. జిల్లాలో ఎంపీ నిధుల కింద మంజూరైన పనులను ఎలాంటి పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని పనులకు నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. మగ్గాలపై ఆధారపడిన అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలన్నారు. జెడ్పీ సీఈవో కేతన్ గార్గ్ మాట్లాడుతూ, పీఎం కిసాన్ పథకంలో సిసిఆర్సి కార్డులు కలిగి ఉన్న కౌలు రైతులకు కూడా పిఎం కిసాన్ వర్తింపచేసే దిశగా కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరుకు కషి చేయాలని ఎంపీ మాధవను కోరారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ కౌలు రైతులకు కూడా ఈ పథకం అమలు అయ్యే విధంగా పార్లమెంట్లో చర్చిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గానికి సంబంధించి పెండింగ్లో ఉన్న పనులన్నీ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఎంపీ గోరంట్ల మాధవ్ సమీక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రయివేటు పాఠశాలల్లో 20 శాతం అడ్మిషన్లు కల్పించాలని జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలో ప్రభుత్వ ఉత్తర్వులు చేసే విధంగా చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో లలితబాయి, సిపిఒ విజయ్ కుమార్, డిఆర్డిఎ పీడీ నరసయ్య, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ రషీద్ఖాన్, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్వి.కృష్ణారెడ్డి, విద్యాశాఖ అధికారి మీనాక్షి, ఐసిడిఎస్ పీడీ లక్ష్మి కుమారి సంబంధిత జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

◆టిడిపిలో కొనసాగుతున్న సర్వేలు

◆అభ్యర్థులు, పార్టీ పరిస్థితిపై వేరువేరుగా సర్వేలు

గ్రాఫ్ పెరిగిందా..?

తెలుగుదేశం పార్టీ పరిస్థితి ఏ రకంగా ఉందన్న దానిపై అంచనాకు సర్వే బృందాలు దిగాయి. జనంలో పార్టీ గ్రాఫ్ ఏ రకంగా ఉందన్నది ఈ బృందాలు పరిశీలిస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేరువేరుగా సర్వేలు కొనసాగుతున్నాయి. ఈ సర్వేల్లో ఏ రకంగా తమ పరిస్థితి ఉందన్నది గుబులు నేతల్లోనూ నెలకొంది. కొంతమంది నేతలు సర్వే బృందాలను ఏ రకంగా ప్రసన్నం చేసుకునే పనిలోనూ ఉన్నట్టు పార్టీ వర్గాల్లోనే చర్చ నడుస్తోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తెలుగుదేశం పార్టీకి మంచి పట్టున్న జిల్లాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా ఉంది. 2019 ఎన్నికల్లో గతంలో ఎన్నడూలేనంతగా దెబ్బతింది. 14 నియోజకవర్గాల్లో 12 స్థానల్లో ఓటమి చెందింది. రెండు పార్లమెంటు స్థానాలనూ కోల్పోయింది. ఆ తరువాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎదురు గాలే వీచింది. తాడిపత్రి పురపాలక సంఘం మినహా అన్ని మున్సిపాలిటీల్లోనూ ఓటమి చెందింది. గతంలో ఎన్నడూ ఇంతటి ఘోర ఓటమిని తెలుగుదేశం పార్టీ జిల్లాలో చవి చూడలేదు. ఒక రకంగా పార్టీ శ్రేణులు సైతం నైరాశ్యంలోకి వెళ్లాయి. ఇటువంటి తరుణంలో త్వరలో సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. కొన్ని నెలల్లో ఎన్నికలూ జరగనున్నాయి. ఇప్పుడు పార్టీ పరిస్థితి ఏ రకంగా ఉందన్న అంచనాలను వేసుకునే పనిలో ఆ పార్టీ అధిష్టానం పడింది. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు జైలుకెళ్లి వచ్చాక ఏమైనా గ్రాఫ్ పెరిగిందా..? లేదా..? అన్నది కూడా అంచనా వేస్తున్నారు. ప్రధానంగా మూడు బృందాలు జిల్లాలో సర్వేలు చేపట్టినట్టు సమాచారం. అందులో ఒకటి పార్టీ కార్యక్రమాలపై దృష్టి పెట్టగా మరొకటి ప్రజల్లో పార్టీ పరిస్థితి ఏరకంగా ఉందన్నది సర్వేల ద్వారా అంచనా వేస్తోంది. మరొకటి నేతలెవరైతే బాగుంటుందన్నది పరిశీలిస్తోంది. ఇప్పుడున్న నాయకుల పరిస్థితి ఏ రకంగా ఉంది. ..కొత్తగా ఎవరైనా అవుత్సాహికులున్నారా అన్నది కూడా పరిశీలిస్తున్నారు. కొత్త వారైతే వారి ఆర్థిక స్థితిగతులేమిటన్నది కూడా అంచనా వేసే పనిలోనున్నారు. సామాజిక తరగతుల వారీగానూ ఈ అధ్యయనం సాగుతోంది. ఈ రకమైన సర్వేలు నడుస్తున్న సమయంలో ఉన్న నేతలు తమ పట్టును నిరూపించుకునేందుకు సర్వే బృందాలను గుర్తించి వారి ద్వారా అనుకూలమైన నివేదికలను అధిష్టానానికి అందించే విధంగా చూసుకునే పనిలోనూ ఉంటున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇంకో వైపు అధికార వైసిపి కూడా తమ బలబలాతోపాటు, ప్రతిపక్ష పార్టీ బలహీనతలపైనా దృష్టి పెడుతోంది. ఆ పార్టీ కూడా ప్రభుత్వ, ప్రయివేటు సర్వేలను నిరంతరాయంగా చేపడుతోంది. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో రాజకీయాలు మరింత రసవత్తరంగా సాగనున్నాయి. టిడిపి కూడా సర్వేల ద్వారా అభ్యర్థుల ఎంపికలను చేపట్టనుంది. గతంలోలాగా నేతల ఒత్తిళ్లపై కాకుండా సర్వేలపై ఆధారపడి ముందుకెళ్లే పరిస్థితి నెలకొనడంతో ఇప్పుడున్న నేతలు తిరిగి టిక్కెట్టును నిలబెట్టుకునేందుకు పావులు కదుపుతుండగా, కొత్త వారు కూడా తమ ఆర్థిక బలాన్ని చూపించి టిక్కెట్టును సాధించేందుకు సిద్ధమవుతున్నారు. కొత్త, పాతల మధ్య పోటీ సైతం నెలకొంటోంది. సర్వేల నివేదికల ద్వారా అధిష్టానం ఎటువంటి అడుగులు వేస్తుందన్నది చూడాల్సి ఉంది. ఏది ఏమైనా టిడిపిలోనూ అప్పుడే ఎన్నికల కసరత్తు ఊపందుకుంటోంది. నేతల్లో కదలిక ఊపందుకుంటోంది.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

బంద్ సందర్భంగా హిందూపురంలో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలని, కడపలో ఉక్కు పరిశ్రమను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ జిల్లా వ్యాప్తంగా విజయవంతం అయ్యింది. అన్ని ప్రయివేటు విద్యాసంస్థలను మూసి వేసి బంద్కు సహకరించారు. ప్రభుత్వ పాఠశాలలు సైతం మూతబడ్డాయి. ఆయా ప్రాంతాల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీలు చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ ర్యాలీల్లో నినదించారు. కేంద్ర ప్రభుత్వం విశాఖను ప్రయివేటీకరించాలని చూస్తే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ చేయకుండా కేంద్రంపై పోరాటం సాగించాలని విద్యార్థి సంఘాల నాయకులు తెలియజేశారు.

వార్త 6లో

కీలక కేసులు గుర్తించాలి : ఎస్పీ

ప్రజాశక్తి - మడకశిర

కీలక కేసులు గుర్తించి నిందితులకు శిక్ష పడేలా చూడాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం నియోజకవర్గ పరిధిలోని రొళ్ల, మడకశిర సర్కిల్ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డ్స్ లను పరిశీలించారు. ఈసందర్భంగా పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ డీఎస్పీ హుస్సేన్పీరా, సిఐ, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్లో రికార్డుల పరిశీలన

రాష్ట్రస్థాయి బాస్కెట్బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

రాష్ట్రస్థాయి బాస్కెట్బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్లు ధర్మాంబ బాస్కెట్బాల్ అసోషియేషన్ అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. గత నెల 21న అనంతపురం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి బాస్కెట్బాల్ పోటీలలో బాలికల విభాగంలో యశస్విని, బాలుర విభాగంలో కార్తీక్ ప్రతిభ కనబరచినట్టు వారు తెలిపారు. దీంతో గురువారం నుంచి 11వతేదీ వరకు అన్నమయ్య జిల్లా మదనపల్లి పట్టణంలో నిర్వహించే ఏపీ ఎస్ఎఫ్ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ డిస్ట్రిక్ అండర్-14 బాస్కెట్బాల్ పోటీలలో వీరు పాల్గొంటున్నారు.

ప్రతిభా విద్యార్థులతో ధర్మాంబ బాస్కెట్బాల్ అసోషియేషన్ ప్రతినిధులు

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

ప్రజాశక్తి మడకశిర

పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి టి ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన డిఎ, పిఆర్సితో పాటు పిఎఫ్ బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు తిప్పన్న, జిల్లా ఉపాధ్యక్షులు రోళ్ల కరియన్న, తిప్పేస్వామి, రొళ్ల మండల అధ్యక్షులు ఉదయ్ కుమార్, మడకశిర డివిజన్ కన్వీనర్ జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అటవీ చట్టాలు గాలికి..!

◆ కనిపించని వన్యప్రాణుల సంరక్షణ చట్టం ◆ వన్యప్రాణులు మరణిస్తున్నా పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

కనుచూపు మేర కనిపించే అడవుల సంరక్షణ కోసం ప్రభుత్వలు చేసిన చట్టాలను కాపాడాల్సిన అటవీశాఖ అధికారులు చట్టాలను చూట్టాలుగా మార్చుకుంటున్నారు. జిల్లాలో అటవీ శాఖ చట్టలు కనుచూపు మేర కనిపించకుండా చేశారన్నా విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి ప్రత్యేక్ష నిదర్శనం హిందూపురం ప్రాంతమే లేపాక్షి మండలం కొండూరు పరిసర ప్రాంతాల్లోని రిజర్వ్ ఫారెస్ట్లో ప్రతిరోజూ కొందరు యంత్రాలతో పనులు నిర్వహిస్తున్నారు. తద్వారా వన్యప్రాణులు సంరక్షణ లేక భయభ్రాంతులకు గూరవుతున్నాయి. దీంతో వన్య ప్రాణులు అడవులను వదిలేసి జనావాసాలలో తిరుగుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయి. ఇంతజరుగుతున్నా వన్యప్రాణుల సంరక్షణకు అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. వేల ఎకరాల ప్రయివేటు భూములకు రిజర్వ్ ఫారెస్ట్ నుంచి దారిని ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు ఇస్తున్నారు. దీంతో ప్రయివేటు భూముల వారు అడవుల్లో ఏర్పాటు చేసిన దారిగుండా ప్రతిరోజూ యంత్రాలు, వాహనాలు వెళ్లడమే కాకుండా ఆ దారికి ఇరువైపులా చెట్లు మొలవకుండా వేర్లతో సహా తొలగిస్తూ ఆ దారిని శాశ్వత రస్తాగా మారుస్తున్నారు. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ లోపాయికారి ఒప్పందం చేసుకుని వారికి సహకరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అటవీ ప్రాంతాలలోని పనులు ఉపాధి హామీ పథకం కింద నిర్వహించాలని నిబంధనలు ఉన్నాయి. ఆ నిబంధనలు పాటించకుండా యంత్రాలతో పనులు చేస్తూ ఆయా గ్రామల ప్రజలకు సైతం ఉపాధి లేకుండా చేస్తున్నారు. ఇప్పటికే వర్షాలు రాక కరువు ఛాయలు అలుముకున్న సత్యసాయి జిల్లాలో అడవులు, రెవెన్యూ భూములలో సైతం యథేచ్ఛగా చెట్లునరికి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ప్రతిరోజు పదుల సంఖ్యలో లారీలకు కలప లోడుచేసి అక్రమంగా గోవాకు సైతం తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తంతు మొత్తం అటవీ అధికారులే నిర్వహిస్తున్నారని సంబంధిత ప్రాంత ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా జిల్లాలో ప్రతిరోజూ కొన్ని వేలచెట్లు అక్రమంగా నరికి సామిల్లులకు, ఇటుక బట్టీలకు, పరిశ్రమల్లోని బాయిలర్లకు సైతం తరలిస్తున్నారు. ఈ తథాంగం మొత్తం అటవీ అధికారులకనుసల్లోనే జరుగుతోందని తెలుస్తోంది. అడవులు సైతం తొలగిస్తూ వేల ఎకరాలలో అటవీ అధికారులు ప్రతి సంవత్సరం అడవులను తొలగిస్తూ., ఆ కలపను బొగ్గు మాఫియా కు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిధులను ఖర్చు పెట్టడానికి కొత్త మొక్కలను నాటుతున్నారు. నాటడానికి యంత్రాలను వినియోగిస్తున్నారు. వాటిని సంరక్షణ చేయడం లేదు. అడవులు లేక పోవడంతో వన్యప్రాణులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నాయి. అడవులు లేక పోవడంతో జనావాసాల్లోకి వన్య ప్రాణులు వస్తున్నాయి. ఇలా వచ్చి గత సంవత్సరం ఒక చిరుత అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. అడవిలో శబ్ధాలకు తట్టుకోలేక ఒక చెరువు దగ్గర వచ్చి చిరుత చనిపోయింది. వన్య ప్రాణుల చట్టం మేరకు అడివిలో పెద్ద యంత్రాలతో పనులు చేయరాదు. అయినప్పటికీ యంత్రాలతో పని చేయడం వల్ల వన్యప్రాణులు బయటకు వచ్చి ప్రాణాలు కోల్పోతున్నాయి. వన్యప్రాణుల చట్టం ఫారెస్ట్ అధికారులకు వర్తించదా అని పర్యావరణవేత్తలు వాపోతున్నారు. సమస్త జీవరాసులకు ఆలవాలమైన అడవులను, చెట్లను రక్షించి, కరువు ప్రాంతాన్ని కాపాడాలని ప్రభుత్వం తీసుకోచ్చిన వాల్టా చట్టాన్ని రక్షించాల్సిన అవసరం ఉంది. దీనిపై సమగ్ర జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టి కన్జర్వేషన్ అన్న పదాన్ని విస్మరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

కొండూరు అటవీశాఖ భూముల్లో జెసిబిలతో తీసిన గుంతలు

ఇటీవల జనావాసాల్లోకి వచ్చి మృతి చెందిన చిరుత (ఫైల్ ఫొటో)

నష్టపోయిన పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి - రొద్దం

గాలివానకు నేలకొరిగిన వరి పంటల పొలాలను వ్యవసాయ అధికారులు బుధవారం పరిశీలించారు. మూడు రోజుల క్రితం కురిసిన గాలివానకు మండలంలోని కలిపి, శేషాపురం, బూదిపల్లి గ్రామాల్లో వరిపంటను నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో గ్రామ ఉద్యాన సహాయకులతో పాటు సంబంధిత రైతులతో ఎఒ నివేదిత పంటపొలాలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా 390 ఎకరాల మేర పంటనష్టం జరిగిందని ఆమె తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు చెప్పారు.

దళితుల భూములు తిరిగి ఇచ్చేంతవరకు పోరాటం

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని కొండూరు గ్రామంలో కోర్లకుంట, కొండూరు గ్రామాలకు చెందిన సుమారు 147ఎకరాల దళితుల భూములు తిరిగి దళితులకు ఇచ్చేంతవరకు పోరాటం కొనసాగిస్తామని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్కుమార్ పేర్కొన్నారు. వీరి ఆధ్వర్యంలో బుధవారం కొండూరు రెవిన్యూ పొలంలోని సర్వె నెంబర్ 389, 388, 390, 402, 394, 246, 265, 372, 245, 274, 263, 375, 307, 242, 226, 215లలోని భూముల్లో దళితులు, నాయకులు ట్రాక్టర్లతో భూమిని చదును చేసి మొక్కజొన్న విత్తనాలు వేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుశలవ అనే సంస్థ నిరక్షురాస్యులైన రైతులను నమ్మబలికి భూములు ఇప్పించుకున్నారన్నారు. భూముల్లో కంపెనీలు పెట్టి ఉపాధి కల్పిస్తామని చెప్పారన్నారు. అయితే ఇక్కడ ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ఉపాధి లభించలేదని అన్నారు. ఈనేపథ్యంలో ఈ భూముల్లో వ్యవసాయం చేసుకొని జీవించాలన్న ఉద్దేశ్యంతో రైతులు పొలంలోకి వెళితే కేసులు బనాయించి భయపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతధికారులు స్పందించి వెంటనే దళితులు భూములు వారికే ఇచ్చి వ్యవసాయం చేయడానికి సహకరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే భూములు ఇచ్చేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు జ్యోతి, రామకృష్ణ, వెంకటేష్, గంగాధరప్ప తదితరులు పాల్గొన్నారు.

భూపోరాటంలో నాయకులు, దళిత రైతులు

ప్రజావ్యతిరేక ప్రభుత్వాలను నిలదీద్దాం : సిపిఎం

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీద్దామని సిపిఎం రాష్ట్ర నాయకులు ఓబులు పిలుపునిచ్చారు. ఈ ఈమేరకు బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిపిఎం ఆధ్వర్యంలో నవంబర్ 15న విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరి కార్యక్రమానికి సంబందించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర నాయకులు ఓబులు మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు కలవరపరుస్తున్నాయన్నారు. రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్ల పూర్తి కావస్తున్నా ఇంతవరకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. బిజెపి పాలనలో మొత్తం దేశమే అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ముఖ్యంగా బిజెపి పాలనలో ఉన్న రాష్ట్రాలలో మైనారిటీలకు భద్రత లేకుండా పోయిందని విమర్శించారు. కోట్లాదిమంది కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్లను తెచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం నవంబర్ 15న విజయవాడలో నిర్వహించే బహిరంగసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇఎస్ వెంకటేష్, పెద్దన్న, పైపల్లి గంగాధర్, బడా సుబ్బిరెడ్డి, నాయకులు జియల్ నరసింహులు, లక్ష్మీనారాయణ, పైపల్లి గంగాధర్, సాంబశివ, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్మవరం టౌన్ : అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజారక్షణబేరి కార్యక్రమంలో భాగంగా ఛలో విజయవాడను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, పట్టణ కార్యదర్శి నామాలనాగార్జున పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సీపీఎం పార్టీ ఆవరణంలో ఛలో విజయవాడ కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్హెచ్ బాషా, రైతుసంఘం మండల కార్యదర్శి మారుతి, వెంకటస్వామి, సిఐటియు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవలోనే సంతృప్తి

ధర్మవరం టౌన్ : ప్రజలకు సేవ చేయడంలోనే సంతృప్తి ఉందని ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ ఉపాధ్యక్షులు వాసవి రత్న చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాయగూరల మార్కెట్ వద్ద గల వాసవి క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ హాస్పిటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వాసవి క్లబ్ ధర్మవరంలో ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. వాసవి క్లబ్ రీజనల్ ఛైర్మన్ నాగ సత్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ గుప్తా, శ్రీనివాసులు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అన్న స్ఫూర్తితో నేటి వాసవి క్లబ్లు ముందంజలో ఉండడం ఆనందించదగ్గ విషయమని తెలిపారు. భవిష్యత్తులో కూడా వాసవి క్లబ్లు మరిన్ని సేవలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూపురం అధ్యక్షులు సూరి, కార్యదర్శి బాలాజీ, కోశాధికారి శశి, పుట్టపర్తి క్లబ్ అధ్యక్షులు మణికంఠ, కార్యదర్శి సోము కోశాధికారి విక్రమ్, కోటి లక్ష్మీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కదిరి టౌన్ : ఎన్పి కుంట మండలం డి. కొత్తపల్లిలో సీతారాముల లక్ష్మణ ఆంజనేయ స్వామి ఆలయనిర్మాణం కోసం వైసీపీ రాష్ట్ర సిఇసి సభ్యులు పూల శ్రీనివాస రెడ్డి విరాళం అందజేశారు. ఈసందర్భంగా నిర్వాహకులను రూ. 30వేలను అందజేశారు . ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

బీమా సాయం అందజేత

గాండ్లపెంట : మండల కేంద్రానికి చెందిన బాబు సింగ్ వద్దిరెడ్డిపల్లి చెందిన శంకరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. వీరి కుటుంబాలకు పదివేల రూపాయల చొప్పున 20 వేల రూపాయలను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రఫీ, స్థానిక సర్పంచి ఎస్ రహమతుల్లా సింగిల్ విండో అధ్యక్షులు ఎస్పి హైదర్, ఎంపీటీసీ పామిడి మహమ్మద్, ఇక్బాల్ సికిందర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 9న లోక్అదాలత్

కదిరి అర్బన్ : న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు డిసెంబర్ 9వ తేదీన స్థానిక కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణంలో పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ అధిక సంఖ్యలో కేసులు రాజీ చేయాలని పోలీసులకు సూచించారు. ఈ సమావేశంలో సిఐలు నారాయణరెడ్డి వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, ఆయా మండలాల ఎస్ఐలు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు

కదిరి టౌన్ : కేంద్ర ప్రభుత్వ సంస్థ, పట్టణ అభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని మున్సిపల్ వాటర్ ట్యాంక్ వద్ద మెప్మా ఆధ్వర్యంలో జల్ దివాళి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ డీఈ మాట్లాడుతూ మున్సిపాలిటీ నీటిని వాడాలని సూచించారు. నీటిని వధా చేయకూడదని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. మహిళలకు బ్యాగులు, వాటర్ ట్యాంక్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కదిరి టౌన్ : క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే సిద్దా రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎస్టిఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ కాలేజియేట్ గ్రూప్ - (పురుషుల) టోర్నమెంట్ 2023-24ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండే విద్యార్థులను క్రీడల పట్ల ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపల్, యూనివర్సిటీ బోర్డ్ మెంబర్లు, టోర్నమెంటు నిర్వాహకులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్కు రెండు బస్సులు ఏర్పాటు

హిందూపురం : ఈ నెల 11 వ తేదీన హైదరాబాదులో మాదిగల ఎ,బి,సి,డి వర్గీకరణ కోసం ఎంఆర్పిఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు హిందూపురం నుంచి రెండు బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు వైసిపి నాయకులు వేణురెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో దళిత నాయకులు వేణురెడ్డిని కలిసి హిందూపురం నుంచి రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. స్పందించిన ఆయన బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాంమూర్తి, నాగరాజు, శ్రీరాములు, ఆనంద్, నరసింహులు, వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంత్ రెడ్డి, నక్కలపల్లి శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే రోడ్డు పనులను ప్రారంభిస్తాం

హిందూపురం : పట్టణ ప్రజల చిరకాలిక కోరిక అయిన రైల్వే రోడ్డు పనులను త్వరలో ప్రారంభిస్తామని వైసిపి నాయకులు వేణురెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, మున్సిపల్ అధికారులతో కలిసి రైల్వే రోడ్డును పరిశీలించారు. రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించాల్సిన భవనాలను, మురుగు కాలువలను, విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇ వెంకటరమణ, ఎసిపితో పాటు పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



రైల్వే రోడ్డును పరిశీలిస్తున్న దృశ్యం

విద్యాసంస్థల బంద్ విజయవంతం

ప్రజాశక్తి - హిందూపురం

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తు విద్యార్థి, యువజన సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం హిందూపురం పట్టణంతో పాటు నియోజక వర్గ వ్యాప్తంగా విద్యాసంస్థలు మూతపడ్డాయి. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యార్థులు కలిసి ఉదయం నుంచి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలకు వెళ్లి బంద్కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తచెరువు. : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడానికి కుట్ర పన్నుతున్నదని దీనిని పరిరక్షించుకుందామని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి పవన్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్లో భాగంగా బుధవారం కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల్లోనే అన్ని ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను బంద్ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు అంజి, గోవర్ధన్, భరత్ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు, లేపాక్షి మండలాల్లో నిర్వహించిన విద్యాసంస్థల బంద్లో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు

లేపాక్షి : రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ లో భాగంగా లేపాక్షి మండలంలోని మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలను బంద్ చేయించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : కడప ఉక్కు పరిశ్రమ సాధనకు ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ మడకశిరలో విజయవంతం అయింది. బంద్లో భాగంగా పిడిఎస్యు, ఎస్ఎఫ్ఐ నాయకులు జూనియర్ కళాశాల విద్యార్థులను బయటకు పంపి కళాశాలను బంద్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నరేష్, సందర్భంగా పిడిఎస్యు జిల్లా కార్యదర్శి ఉమేష్, ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థిసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : విద్యా సంస్థల బంద్ కదిరిలో విజయవంతం అయింది. వారం రోజులుగా విద్యార్థులలో చైతన్యం కల్పించడం వల్ల 60శాతం స్వచ్ఛంధంగా విద్యార్థులు కళాశాలలకు హాజరు కాలేదన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నియోజకవర్గ కార్యదర్శి విజయ్, ఎఐఎస్ఎఫ్ వల్లం రాజేంద్రప్రసాద్, నళ్లజోడు పవన్, ఎస్ఎఫ్ఐ ప్రవీణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం నిర్వహించిన విద్యా సంస్థల బంద్ చిలమత్తూరులో విజయవంతమైంది. ప్రయివేటు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా పాఠశాలలకు సెలవు ప్రకటించాయి. ఇక ప్రభుత్వ పాఠశాలలను ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు బాబావలి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు బంద్ చేయించారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు కదిరి విద్యార్థినులు

కదిరి టౌన్ : అనంతపురంలో అశోక్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఎస్జిఎఫ్ఐ జిల్లాస్థాయి కరాటే పోటీలలో కదిరి విద్యార్థినులు సత్తాచాటారు. కోచ్ షేక్షావలి ఆధ్వర్యంలో అండర్ 14, 17, 19 విభాగానికి విద్యార్థులు ఎంపికైనట్లు షేక్స్ వలి తెలిపారు. ఈ పోటీలలో కదిరి కి చెందిన బ్లూ మూన్ కాలేజ్ నుండి విద్యార్థినులు అండర్ 19, 56, 52 కేజీల విభాగంలో పి.సిరి, ఎం.నికిత బాయ్ ప్రతిభ కనపర్చారు. అదేవిధంగా స్పేస్ జూనియర్ కాలేజ్ నుండి విద్యార్థిని అండర్ 19 44, కేజీల విభాగంలో పి.యశస్విని , బాలికల ఉన్నత పాఠశాల నుండి విద్యార్థినిలు నాగ వర్షిత, దీపిక, వర్షిత, సోనీబాయ్, థామస్ స్కూల్ విద్యార్థిని డింబు శ్రీ ఎంపికయ్యారన్నారు. విజయనగరంలో 9,10,11 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు బయలుదేరుతున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి ఎస్జిఎఫ్ఐ సెక్రటరీ సుగుణమ్మ, పీడీ శకుంతలమ్మ, ఇడి చల్లా ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి కదిరి అర్బన్

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా పని చేస్తున్న జర్నలిస్టులకు కదిరి నియోజకవర్గంలో ఇళ్లస్థలాలు పంపిణీ చేస్తామని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జర్నలిస్టుకు మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించిందన్నారు. కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా అక్రిడిటేషన్ కలిగినప్రతి జర్నలిస్టుకు త్వరలోనే ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని చెప్పారు. ఈసందర్భంగా జర్నలిస్టులు, ముఖ్యమంత్రితో పాటు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, కెవి రమణ, ప్రసాద్, నరేందర్ రెడ్డి, సుల్తాన్, హరి, అజయ్ ఆచారి, రామ్మోహన్, నాగరాజు, సాదిక్, ఫారూఖ్తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఆరోపణలు నిజమని నిరూపిస్తే రాజకీయ సన్యాసం : ఎమ్మెల్యే

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

ప్రజాశక్తి మడకశిర రూరల్

టిడిపి నాయకులు నారాలోకేష్ తనపై చేసిన ఆరోపణలు నిజమని నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తానని అపద్దమని తేలితే అందుకు ఆయన సిద్ధమా అని మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి సవాల్ విసిరారు. ఈ మేరకు ఆయన బుధవారం పట్టణంలోని తన స్వగృహం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నారా లోకేష్ పూర్తి విషయం తెలుసుకుని పరిజ్ఞానంతో మాట్లాడాలని హితవు పలికారు. ఎవరో చెప్పిన మాటలువిని ఒక శాసనసభ్యునిపై తప్పుడు ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. అగళి మండలం రావుడి గ్రామంలో వాలంటర్ గొడవ విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. పాత కక్షలతో రెండు కుటుంబాలు గొడవలు పడి పోలీసుకేసులు పెట్టుకొంటే అందులో తన ప్రమేయం ఉందని ప్రచారంచేసి నిందలు వేయడం తగదదన్నారు. ఆ విషయంతో తన ప్రమేయముందని రుజువు చేస్తే తాను రాజకీయాలనుండి తప్పుకొంటానని నిరూపించక పోతే ఆయన రాజకీయాల నుంచి తప్పుకుంటారా అని సవాల్ విసిరారు.

దళితులను అవమానించడమే పనిగా పెట్టుకున్న 'గుండుమల' : మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దళితులను అవమానించడమే పనిగా పెట్టుకున్నారని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఆరోపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండుమల తిప్పేస్వామి తనపై చేసిన తప్పుడు ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో టీటీడీ బోర్డు మెంబర్గా జగన్మోహన్ రెడ్డి తనకు అవకాశం కల్పించారన్నారు. బ్రహ్మోత్సవాల్లో ఉన్న తనను టికెట్లు అమ్ముకుంటున్నాడని ప్రచారం చేయడం సరికాదన్నారు. ఆయనలా తాను సారాయి పాకెట్లు అమ్ముకొని వేలాది కోట్లు సంపాదించలేదని, ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించలేదని ఆరోపించారు. క్రషర్లు, గ్రానైట్ క్వారీలో ప్రభుత్వాన్ని మోసం చేసినందుకు వేల కోట్లు జరిమానా విధించింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఈరన్నను అవమానించింది నిజం కాదా అని అన్నారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయం చేయాలని హితవు పలికారు.

చిగిచెర్ల సొసైటీ భూములను యథావిధిగా కొనసాగించాలి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

మండలంలోని చిగిచెర్ల పంచాయతీ సొసైటీ భూములు యధావిధిగా కొనసాగించాలని వరదాపురం సూరి వర్గీయులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్కు సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు అరవింద్ రెడ్డి, గంధమనేని నారాయణస్వామి మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి దాదాపు 400 ఎకరాలు చిగిచెర్ల పంచాయతీ సొసైటీ భూములుగా ఉన్నాయన్నారు. వాటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారు సాగులో ఉన్నారని తెలిపారు. వైసిపి నాయకులు, మండల రెవెన్యూ అధికారులు కుమ్మక్కై సాగులోకి ఉన్నవారికి భూమి చెందకుండా చేస్తున్నారని ఆరోపించారు. వైసిపి నాయకులకు, వారి బినామీలకు ఇంటికి మూడు నుంచి ఐదుగురికి చొప్పున పట్టాలు చేయించుకోవాలని ప్రయత్నించడం దారుణమని ఆరోపించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ సొసైటీ భూములను పంచడానికి వీలు లేదని అన్నారు. పంచాలని ప్రయత్నిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ రహీం, దస్తగిరి, తేజ, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

బెంగుళూరుకు అదనపు బస్సు సర్వీసులు

కదిరి టౌన్ : బెంగుళూరు, వంగసంద్రకు అదనపు బస్సు సర్వీసులను నడుపుతామని ఆర్టీసీ కదిరి డిపో మేనేజరు మైనోద్దీన్ తెలిపారు. డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రము 4 నుండి 5 గంటల వరకు నిర్వహించారు. బెంగుళూరు నుండి నరశింహులు అనే వ్యక్తి వంగసంద్ర కు ఉదయం 6 గంటలకు, 10 గంటలకు బస్సులు నడపాలని కోరారు. రెడ్డిపల్లి, మొలకవేమలకు బస్సు నడపాలని నల్లమాడకు చెందిన చంద్ర కోరారు. కటారుపల్లి, సాధులోల్లపల్లికి ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు నడపాలని కటారుపల్లి రమణారెడ్డి, తుమ్మలబైలు అన్వర్బాషా కోరారు. కదిరి నుండి పుట్టపరికి పోయేందుకు చివరి బస్సుగా రాత్రి 9.00 గంటలకు బస్సు ఏర్పాటు చేయాలని పుట్టపర్తికి చెందిన రమేష్ కోరారు. తలుపుల నుండి కదిరి కి వచ్చేందుకు ఉదయం 9 గంటలకు బస్సు ఏర్పాటు చేయాలని తలుపులకు చెందిన శిల్ప, నాగరాణి కోరారు. ప్రతి రోజు సాయంత్రం 5 :30 గంటలకు విజయవాడకు బస్సు నడపాలని మదనమోహన్ రెడ్డి,పవిత్ర కోరారు. ఈ సమస్యలపైన డిపో మేనేజరు స్పందించారు. తలుపుల నుండి కదిరికి ప్రతి రోజు ఉదయం 9 గంటలకు బస్సు ఏర్పాటుచేస్తామని, పుట్టపర్తికి చివరి బస్సును రాత్రి 9 గంటలకు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు హరిత, హరిమోహన్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి'

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

ప్రజాశక్తి - పెనుకొండ

ఆంధ్ర రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్నిగురువారం నుండి నిర్వహిస్తున్నట్లు పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మంగమ్మతో కలసి మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు గురించి రాష్ట్ర ప్రజలకు వివరించేందుకు 9వ తేదీన ఆంధ్ర రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా గురువారం గోరంట్ల 1వ సచివాలయం సిరికల్చర్ ఆఫీస్లో ఈకార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్నీ అమలు చేస్తున్నారని శాసనసభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా కుల మతాలకు సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో గురువారం నుంచి ఆంధ్రకు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నందునే ధైర్యంగా గడపగడపకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల కన్వీనర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, ఫుడా చైర్పర్సన్, మున్సిపల్ చైర్మన్, ఎంపీటీసీలు, సర్పంచులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తలపల్లి : గ్రామాల్లోని ప్రతి గడపకు వెళ్లిప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి వైసిపి నాయకులకు, గృహసారథులకు సూచించారు. బుధవారం మండలంలోని డి చెర్లోపల్లి, దంపెట్ల, ఓబుళాపురం, అప్పరా చెరువు, పోట్లమర్రి గ్రామ సచివాలయాలను సందర్శించిన ఆయన సర్పంచులు గుజ్జల రమాదేవి, చల్లా కరుణార్నాయుడు, బండి సరస్వతి, మొర్రెడ్డిగారి శారదమ్మ, అక్కిం దామోదర్ అధ్యక్షతన ఆయా సచివాలయాలలో గహసారథులు, పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశాల్లో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి: రామకృష్ణారెడ్డి, వైసిపి మాదిరెడ్డి జయరామిరెడ్డి సచివాలయ మండల కన్వీనర్ రాంభూపాల్ రెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - రొద్దం

గాలివానకు పంటనష్టపోయిన వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షులు పార్థసారథి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం మండలంలో నష్టపోయిన పంటపొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నరహరి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నాయకులు చిన్నప్పయ్య, రాము, సాయి కళ్యాణ్, అశ్వర్థ నారాయణ, హరీష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాలను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజల వద్దకే పాలన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పరిగి

సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసిన వైసిపి ప్రభుత్వం ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లిందని స్థానిక ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వైఎస్ఆర్ కూడలి సమీపంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాల ఏర్పాటుతో పరిపాలన మరింత సులభతరం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, సర్పంచులు లక్ష్మీదేవి, శివశంకర్, మంజునాథ్ రెడ్డి, జెడ్పీటీసీ శ్రీరాములు, ప్రభాకర్, కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీటీసీ లింగమ్మ గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పుట్టపర్తి క్రైమ్ : సత్యసాయి ప్రశాంతి రైల్వే స్టేషన్ నుంచి పుట్టపర్తికి వస్తున్న ఆటో అదుపుతప్పి డివైడర్ ను ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. పట్టడానికి చెందిన ఆటో స్నేహప్రియ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సమీపంలో డివైడర్ను ఢీకొంది. ఆటో బోల్తా పడటంతో డ్రైవర్కు కాలు విరగగా, మరో ప్రయాణికునికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు.

హంద్రీనీవా కాలువలో యువకుడి మృతదేహం

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలో గల హంద్రీనీవా కాలువలో యువకుడి మృతదేహం లభ్యమైంది. పుట్టపర్తి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు...కర్నాటకలోని గుల్బర్గా జిల్లా ముక్తాపూర్ దర్గా వీధిలో నివాసం ఉంటున్న ట్రాక్టర్ డ్రైవర్ రానెప్ప (32) కాలువలో పడి మృతిచెందాడు. హంద్రీనీవా కాలువకు అడ్డుగా వేసిన కంచ వద్ద మృతదేహం నిలిచిపోవడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డన్నారు. రూరల్ ఎస్ఐ దాదాపీర్ తెలిపారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - రొద్దం

బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నియోజకవర్గం ఇంచార్జి బికె. పార్థసారథి అన్నారు. బుధవారం మండలంలోని తన స్వగృహంలో క్లస్టర్ ఇన్ఛార్జులు, బూత్ ఇంచార్జ్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ భరోసా కల్పిస్తూ చేపడుతున్న భవిష్యత్తుకు బాబు గ్యారెంటీ కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీకే సాయి కళ్యాణ్, హరీష్, హరికృష్ణ, మంజు, ప్రభాకర్, అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆపార్టీ స్థానిక నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని 67,68, బూత్ల పరిధిలో టిడిపి నాయకులు బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలకు మినీ మేనిఫెస్టో లోని సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు తుమ్మల మనోహర్, రామాంజనేయులు, నందకుమార్, జయచంద్ర, వెంకటనారాయణ, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు 'చిగిచెర్ల' విద్యార్థులు

ధర్మవరం టౌన్ : జాతీయస్థాయి హాకీ పోటీలకు ధర్మవరం మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం. తిమ్మారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ప్రతాపరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల మూడవ తేదీ నుండి 5వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా నక్కపల్లి లో జరిగిన అండర్ 17 స్కూల్ గేమ్స్ స్టేట్ లెవెల్ బాల బాలికల ఎంపిక పోటీలలో అనంతపురం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి అత్యంత ప్రతిభ కనపరిచిన తమ పాఠశాల విద్యార్థులు హేమ, తపస్విని, పూజిత జాతీయ సాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారన్నారు. డిసెంబర్ నెలలో మధ్యప్రదేశ్లోని గ్వాలియర్ ఆడే ఆంధ్రప్రదేశ్ జట్టుకు వీరు ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. ఈసందర్భంగా హెచ్ఎం, ఫిజికల్ డైరెక్టర్తో పాటు పాఠశాల కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు ప్రతిభా విద్యార్థులను అభినందించారు.

రబీ సాగుకు విత్తన వేరుశనగ పంపిణీ చేయండి

అమరాపురం : రబీ సీజన్లో పంటసాగుకు వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేయాలని టిడిపి మండల కన్వీనర్ గణేష్ కోరారు. విత్తన కాయలతో పాటు ఎరువులు మందులు సకాలంలో పంపిణీ చేయాలని కోరారు. ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏవో మంజునాథ చారిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామిరెడ్డి, జయకుమార్, రఘు, నాగరాజు, చెన్నప్ప, మంజునాథ్, రవికుమార్, రాజశేఖర్, జాకీర్, జెసిబి నాగప్ప, సీనప్ప, నాగరాజు, వీరలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నారనాగేపల్లి విద్యార్థులు

రొద్దం : రాష్ట్ర స్థాయి సాఫ్ట్ వాల్ జట్టు ఎంపిక పోటీల్లో మండలంలోని నారానాగేపల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బుధవారం అనంతపురం ఆర్డీటీ క్రీడా మైదానంలో జరిగిన అండర్ 14 సాఫ్ట్బాల్ సెలక్షన్స్లో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు సుకన్య, హిందూ, సాయి, రామాచారి, ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రంగప్ప, పిఇటి మహేష్ తెలపారు. వీరు ఈనెల 18 19 20వ తేదీలలో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు.

గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయండి

కొత్తచెరువు : నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎల్ఎం ఉమా మోహన్ రెడ్డి కోరారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించి గోడపత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ స్థానిక అధికారి జయరాం, వైసిపి జిల్లా నాయకులు బాల నరసింహారెడ్డి, హరినాథ్రెడ్డి, గోవిందు, వీరనారాయణ రెడ్డి, వేణుగోపాల్, అటెండర్ మునీరు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై దళిత ఎమ్మెల్యేలు స్పందించాలి

మడకశిర : ఎస్సీ వర్గీకరణ విషయంలో దళిత ఎమ్మెల్యేలు స్పందించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవిషయంలో కర్నాటకలోని మంత్రులు, ఎమ్మెల్యేలు తీసుకున్న చర్యలు అభినందనీయమన్నారు. జస్టిస్ ఎ.జె.సదాశివ కమిషన్ నివేదికను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర నిరసనలు చేపట్టాలని తీర్మానించడం హర్షించదగ్గ విషయమన్నారు. వారిని చూసైనా రాష్ట్రంలోని దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించాలని ఆయన కోరారు. తెలుగు రాష్ట్రాల్లోని ఎస్సీ మంత్రులు ఎమ్మెల్యేలు వారి పదవులను కాపాడుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. త్వరలోనే ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలోనిమాదిగ మంత్రులు ఎమ్మెల్యేలను కలిసి ఎస్సీ వర్గీకరణ విషయంలో చివరి సారిగా వినతి పత్రాలు అందజేస్తామని చెప్పారు.

అర్హులందరికీ ఇళ్లపట్టాలు ఇవ్వాలి

బత్తలపల్లి : బత్తలపల్లిలో ఇల్లులేని నిరుపేదలందరికీ వెంటనే ఇళ్ల పట్టాల పంపిణీ చేయాలని సిపిఐ ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి మధు, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహశీల్దార్కార్యాలయం వద్ద ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలతో కలిసి నిరసన తెలిపారు.అనంతరం రెవెన్యూ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుల్లాయప్ప, బండల వెంకటేష్, ప్రసన్న, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

హిందూపురం : టపాసుల వ్యాపారులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించకపోతే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని పురం తహశీల్దార్ స్వర్ణలత, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అన్నారు. దీపావళీ పండుగను పురస్కరించుకుని పట్టణంలో లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న 43 మందితో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ స్వర్ణలత అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తహశీల్దార్తో పాటు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, వన్టౌన్ సిఐ శ్రీనివాసులు, అగ్నిమాపక అధికారి ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు చట్ట విరుద్ధంగా లైసెన్స్ లేకుండా మందు గుండు సామాగ్రి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దీపావళి మందులు విక్రయించదల్చిన వాళ్లు తాత్కాలిక అనుమతులు పొంది, షాపుల వద్ద నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామాగ్రిని తప్పనిసరిగా సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. ఎంజిఎం పాఠశాల మైదానంలో వ్యాపారులకు తాత్కాలిక స్థలాలను కేటాయించడం జరుగుతుందన్నారు. అనంతరం దరఖాస్తు చేసుకున్న 43 మందికి లాటరీ విధానం ద్వారా స్థలం కేటాయించారు. అయితే షాపుల నిర్వహణ కోసం 31 మంది ముందుకు రావాడంతో అందరికి ఎంజిఎం మైదానంలో స్థలాలను కేటాయిస్తామన్నారు. దానికి సంబంధించి పురపాలక సంఘానికి చెల్లించాల్సిన పన్నులను అందరు చెల్లించాలన్నారు. దీనికి వ్యాపారులందరు సమ్మతించారు. ఈ సమావేశంలో ఆర్ఐ అమరేంద్ర, మున్సిపల్ శానిటరి ఇన్స్పెక్టర్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్